
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.4 | కనిష్ఠం 20.5



నిజాంసాగర్‌లోకి స్వల్ప ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, ఆగస్టు 24: నిజాంసాగర్ క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి 400 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. 4.789 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ప్రాజెక్టులోనికి క్రమేపీ వరదనీరు వస్తోంది. 1405.00 అడుగులకు 1391.00 అడుగుల నీరు నిల్వ ఉంది.



నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం

మంత్రి వర్గంలో కామారెడ్డికి..
చోటు దక్కేనా?



మదన్‌మోహన్‌రావు





సుదర్శన్ రెడ్డి

- రెండో విడత మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు
- మంత్రి రేసులో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- ఢిల్లీ పెద్దలతో మంత్రి పదవిపై లాబీయింగ్
- మదన్‌మోహన్‌కు ఏఐసీసీ నేతల అండ
- మరో నాలుగు రోజుల్లో మంత్రివర్గ విస్తరణపై క్లారిటీ
- ఉమ్మడి జిల్లా నుంచి ప్రచారంలో సుదర్శన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావుల పేర్లు

కామారెడ్డి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధిష్ఠానం టీపీసీసీ అధ్యక్షుడితో పాటు మంత్రివర్గ విస్తరణపై రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలతో సంప్రదింపులు జరుపుతోంది. వీలైనంత త్వరగా టీపీసీసీ అధ్యక్షుడితో పాటు రెండో విడతలో నాలుగు క్యాబినెట్ పదవులను భర్తీ చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రెండో విడత మంత్రి వర్గ విస్తరణలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎవరికి మంత్రి పదవి దక్కుతుందోనని ఇరు జిల్లాల్లో చర్చ జోరుగా సాగుతోంది. ఈ రెండో విడత మంత్రివర్గ విస్తరణలో కామారెడ్డి జిల్లాకు చోటు దక్కుతుందో లేదో చూడాలి. అయితే మొదటి నుంచి మంత్రి రేసులో కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఉన్నారు. మొదటి విడతలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎవరికి కూడా అవకాశం ఇవ్వలేదు. నాలుగైదు రోజుల్లో మంత్రివర్గ విస్తరణ చేపట్టనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పెద్దలతో మంత్రి పదవికి లాబీయింగ్ చేస్తున్నట్లు ఆ పార్టీలో చర్చ సాగుతోంది. ఇందులో భాగంగానే మదన్ ఢిల్లీలో మకాం వేసినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాకు మొదటి విడతలో దక్కని చోటు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఈ ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. నిజామాబాద్ జిల్లాలో బోధన్ నుంచి ఎమ్మెల్యేగా సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ నుంచి భూపతిరెడ్డి, కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి నుంచి మదన్‌మోహన్‌రావు, జుక్కల్ నియోజకవర్గం నుంచి తోట లక్ష్మీకాంతారావులు గెలుపొందారు. అయితే మొదటి విడత మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు వస్తాయని అంతా భావించినా ఎవరికి కూడా అవకాశం దక్కలేదు. సామాజిక సమీకరణాల నేపథ్యంలో మొదటి విడతలో ఎవరికి మంత్రి పదవి రాలేదు. ఎన్నికల సమయంలో బీసీలకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ ఒక్కరికి కూడా టికెట్ ఇవ్వకపోవడంతో గెలిచిన వారిలో ఓసీలు కాగా ఒక్కరు ఎస్సీ కావడంతో నిజామాబాద్ జిల్లాకు మొదటి విడతలో మంత్రి పదవి ఇవ్వడం కుదరలేదు. ఉమ్మడి జిల్లాల నుంచి బీసీ ఎమ్మెల్యేలు లేకపోవడంతో ఎమ్మెల్సీగా ఉన్న మహేష్‌కుమార్‌గౌడ్‌కు మంత్రి పదవి దక్కుతుందని మొదట్లో ప్రచారం జరిగినా ఆయన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండడంతో రాష్ట్ర అధ్యక్ష పదవి వస్తుందని ప్రచారం సాగింది. కాంగ్రెస్ అధిష్ఠానం సైతం పీసీసీ పదవిని బీసీ నేతకే ఇవ్వాలని ఆలోచిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ప్రచారంలో ఇద్దరు ఎమ్మెల్యేల పేర్లు

రెండో విడత మంత్రివర్గ విస్తరణపై చర్చకు రావడంతో ఖచ్చితంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మంత్రి పదవి రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం అంగీకరించినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండో విడతలో జిల్లా నుంచి ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు మంత్రి రేసులో ఉన్నారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, మదన్‌మోహన్ రావులు మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. సీనియర్ నేత, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి గత వైఎస్ హయాంలో భారీ నీటి పారుదల శాఖ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రులుగా పని చేశారు. వీరిద్దరు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు. ఇదే అంశం కాంగ్రెస్ అధిష్ఠానంలో తర్జనభర్జన మొదలైంది. సుదర్శన్‌రెడ్డికి ఇప్పటికే ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి ఎక్కువ మందికి మంత్రి పదవులు ఉన్నాయనే అంశంతోనే పదవి మిస్ అయిందని తెలుస్తోంది. రెండో విడతలో ఖచ్చితంగా నలుగురితో క్యాబినెట్ పదవులు భర్తీ చేస్తారని చెబుతుండగా ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి మంత్రి పదవి దక్కుతుందో సస్పెన్స్‌గా మారింది.

మదన్ మోహన్‌రావుకు చాన్స్?

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే భారీ మెజార్టీతో గెలుపొందిన మదన్ మోహన్‌రావుకు మంత్రి వర్గంలో చోటు దక్కే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొదటిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి 24వేలకుపైగా మెజార్టీతో గెలుపొందారు. అయితే మొదటి విడత క్యాబినెట్‌లో మంత్రిగా తనకు అవకాశం ఇవ్వాలని మదన్ మోహన్‌రావు ఆశించారు కానీ చోటు దక్కలేదు. మదన్ మోహన్‌రావుకు ఏఐసీసీ పెద్దలతో మంచి సత్సంబంధాలు ఉండడం రెండో విడత మంత్రి వర్గ విస్తరణలో ఆయనకు మంత్రి పదవి వస్తుందనే భావన అనుచర వర్గాల్లో కలుగుతోంది. అంతేకాకుండా టీపీసీసీ ఐటీ సెల్ చైర్మన్‌గా పని చేశారు. ఆయన రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడు కావడం మరింత కలిసి రానుంది. ఈ సాన్నిహిత్యమే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పార్టీ సీటు తీవ్ర పోటీలో సైతం దక్కడానికి కారణమైంది. వీటికి తోడు మదన్ మోహన్‌రావుకు పలు దేశాల్లో ఐటీ కంపెనీలు ఉండగా ఐటీ రంగంలో ఆయనకు ప్రావీణ్యం ఉంది. యూఎస్, లండన్, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీ, ఔట్ సోర్సింగ్, ప్రొడెక్టులను ఉత్పత్తి చేయడం వంటి బిజినెస్‌లో అనుభవం ఉంది. ఈ నేపథ్యంలో రెండో విడత క్యాబినెట్‌లో విస్తరణలో మంత్రి పదవి ఇవ్వాలని ఆయన ఆశిస్తున్నట్లు తెలిసింది.

ఢిల్లీ పెద్దలతో లాబీయింగ్

మరు నాలుగైదు రోజుల్లో రెండో విడత మంత్రివర్గ విస్తరణ కాంగ్రెస్ అధిష్ఠానం చేయనున్న నేపథ్యంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి రేసులో ఉన్న ఆయన గత కొంత కాలంగా ఢిల్లీలోనే మకాం వేశారు. ఏఐసీసీలో తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి ఖచ్చితంగా మంత్రి పదవి వస్తుందని గంటాపదంగా చెబుతున్నారు. మొదటి విడతలో జరిగిన మంత్రి వర్గ కూర్పులో భాగంగా వెలమ సామాజిక వర్గానికి చెందిన జూపల్లికి మాత్రమే అవకాశం దక్కింది. రెండో విడతలో ఆ సామాజిక వర్గానికి ఒక మంత్రి పదవి దక్కుతుందని ప్రచారం జరుగుతుండగా కామారెడ్డికి చెందిన మదన్‌మోహన్, ఆదిలాబాద్ నుంచి ప్రేమ్‌సాగర్‌రావు పోటీ పడుతున్నారు. ఇందులో ఢిల్లీ పెద్దలు మదన్ మోహన్‌రావుకే అండగా ఉన్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. ఈ విడతలోనైన మంత్రివర్గ ఉపసంఘంలో మదన్ మోహన్‌కు చోటు దక్కుతుందో లేదో చూడాలి.

ప్రతీ కార్మికుడు
తమ పేరు నమోదు చేసుకోవాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 24: ప్రతీ ఒక్క భవన, ఇతర నిర్మాణ కార్మికులు కార్మికశాఖలో తమ పేరును నమోదు చేసుకొని లబ్ధి పొందాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో మాట్లాడుతూ కార్మిక చట్టం ప్రకారం భవనం, ఇతర నిర్మాణాలు జరుగుతున్నప్పుడు వాటి నిర్మాణానికి అయ్యే వ్యయం విలువలో ఒక శాతం సెస్ వసూలు చేసి కార్మికశాఖకు సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా చట్ట ప్రకారంగా ప్రభుత్వ అధికారులు ఎవరైతే పనులను నిర్ణయించేవారు, నిర్మాణానికి అనుమతులు ఇచ్చే అధికారులు ఒక శాతం లేబర్ సెస్ వసూలు చేసి కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని అన్నారు. ఈ విధంగా వసూలు చేసిన సెస్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల యొక్క సంక్షేమం కోసం ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ ఒక్క భవన నిర్మాణ కార్మికులు కార్మికశాఖలో రూ.110 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని తద్వారా వారు అనేక బెనిఫిట్స్ పొందుతారని తెలిపారు. నమోదు అయిన వారు సహజ మరణం పొందితే రూ.1లక్ష 30వేల వరకు, ప్రమాదవశాత్తు మరణం పొందితే రూ.6లక్షల 30 వేల వరకు వారి కుటుంబం లబ్ధి పొందవచ్చని, పాక్షిక వైకల్యం కలుగితే 3 నుంచి 5లక్షల వరకు పొందవచ్చని తెలిపారు. కార్మికుడి కుమార్తె వివాహానికి రూ.30 వేలు, ప్రసూతి సహాయ పథకాలకు రూ.30వేల వరకు పొందవచ్చని అన్నారు. జిల్లా అధికారులు వారివారి శాఖల్లో నిర్మాణ పనులు జరిగినప్పుడు పని ప్రదేశాలను పరిశీలించి కార్మికులకు అవగాహన కల్పించి కార్మికశాఖలో కార్మికుల నమోదు జరిగేటట్టుగా చూడాలని ఆదేశించారు. కార్మికశాఖ అధికారులు పని ప్రదేశాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కార్మికుల పేర్లను నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కమిషనర్ కోటేశ్వర్లు, సీపీవో రాజారాం, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో వ్యక్తి మరణానికి కారణమైన ఆసుపత్రి సీజ్

భిక్కనూరు, ఆగస్టు 24: మండల కేంద్రంలో వ్యక్తి మరణానికి కారణమైన బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రిని, మెడికల్‌ను శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాద్‌రాజ్ సీజ్ చేశారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో, మండల వైద్యాధికారిణి యేమిమా మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి నుంచి పూర్తి వివరాలను సేకరించిన అనంతరం ప్రైవేటు ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లైసెన్స్‌ను పరిశీలించగా లైసెన్స్ వైద్యం చేసే వ్యక్తిపై కాకుండా మరొకరి పేరుపై ఉండటం, మెడికల్ షాపు లైసెన్స్ సైతం మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిపై ఉండగా ప్రస్తుతం మెడికల్ షాపును మరొకరితో నడిపిస్తున్నారని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఎలాంటి లైసెన్స్ లేకుండా డాక్టర్‌గా చెలామణి అవుతూ చికిత్స చేయడంతో పాటుగా ఒక వ్యక్తి మృతికి కారణమైన ఆసుపత్రిని, మెడికల్ షాపును సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఈ మూడు నెలలు జ్వరంతో కానీ, సీజనల్ వ్యాధుల లక్షణాలు ఉన్న వారికి పీఎంపీ, ఆర్ఎంపీ వైద్యులు చికిత్సలు చేయవద్దని, వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహించే వారు తప్పకుండా లైసెన్స్ ఉండాలని, లేని యెడల కఠిన చర్యలు తప్పవన్నారు. మండలంలో పీఎంపీ, ఆర్ఎంపీ, ఇంకా ఎవరైనా వైద్య సిబ్బందిని బెదిరించినా, భయభ్రాంతులకు గురిచేసినా వెంటనే పోలీసుస్టేషన్‌లో వారిపై ఫిర్యాదు చేయించాలని మండల వైద్యాధికారిణికి సూచించారు.



భిక్కనూరులో ఆసుపత్రిని సీజ్ చేస్తున్న దృశ్యం



నాగిరెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయంలో రైతును విచారిస్తున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

తహసీల్దార్ అవినీతి ఆరోపణలపై విచారణ

- నాగిరెడ్డిపేటలో బాధితులతో విచారణ జరిపిన ఆర్డీవో మన్నె ప్రభాకర్

నాగిరెడ్డిపేట, ఆగస్టు 24: నాగిరెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయంలో దళారుల ద్వారా డబ్బులిస్తేనే పనులు చేస్తున్నారని తహసీల్దార్ లక్ష్మణ్‌పైన వచ్చిన అవినీతి ఆరోపణలపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విచారణకు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దళారుల ద్వారా డబ్బులిస్తేనే పనులు చేస్తున్నారని, డబ్బులు ఇవ్వని వారి పనులు చేయడం లేదని ఆరోపిస్తూ పలువురు రైతులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి తమ నిరసన తెలిపిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ వార్త అన్ని పత్రికల్లో శనివారం ప్రముఖంగా ప్రచురితం కావడంతో కలెక్టర్ వెంటనే స్పందించారు. నాగిరెడ్డిపేట తహసీల్దార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి నివేదికను సమర్పించాలంటూ ఆయన ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో మన్నె ప్రభాకర్ శనివారం నాగిరెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయంలో బాధితులతో విచారణ జరిపారు. విచారణ అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు బాధితులతో విచారణ జరిపినట్లు తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. విచారణ పూర్తి చేసి తన వాహనంలో ఆర్డీవో వెళుతున్న సమయంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద కొందరు స్థానికులు అవినీతి తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు.

ఎన్నో ఏళ్ల కల..
ఫలించిన వేళ!

- కాచాపూర్ ప్రత్యేక విండోగా ఉత్తర్వుల జారీ
- అంబరాన్నంటిన కాచాపూర్ గ్రామస్థుల సంబరాలు
- డీసీవో చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్న డీసీసీబీ డైరెక్టర్

భిక్కనూరు, ఆగస్టు 24: ప్రత్యేక విండో ఏర్పాటుకు గ్రామస్థులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేసుతండడంతో ఆ కల నేటికి ఫలించింది. భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామంలో చాలా సంవత్సరాల క్రితమే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(విండో) కాచాపూర్, మాందాపూర్, సంగమేశ్వర్ గ్రామాలను కలుపుని ఏర్పాటైంది. అప్పటి నుంచి ఈ మూడు గ్రామాల రైతులకు అనేక రకాలుగా ఈ విండో ద్వారా రైతులకు రుణాలను అందించడంతో పాటుగా అనేక రకాల కార్యక్రమాలను చేపట్టేవారు. గతంలో పలు కారణాలతో మందాపూర్ బీబీపేట విండోలో, సంగమేశ్వర్ దోమకొండ విండోలో విలీనం కాగా కాచాపూర్‌తో పాటుగా ఆమ్లెట్ గ్రామమైన బంజర్ల గ్రామంతో కలిసి ఈ విండో కొనసాగింది. ఇక్కడి వరకు బాగానే ఉన్న రానురాను విండో ద్వారా తీసుకున్న రుణాలు రైతుల నుంచి రికవరీ కాకపోవడం, తదితర కారణాలతో విండో నష్టాల్లో కూరుకుపోవడంతో 2005లో అప్పటి ప్రభుత్వం కాచాపూర్ గ్రామానికి 16 కిలో మీటర్ల దూరంలో ఉన్న బస్వాపూర్ విండోలో కాచాపూర్ విండోను విలీనం చేసింది. దీంతో కాచాపూర్, బంజర్ల గ్రామస్థులు తిరిగి కాచాపూర్ ప్రత్యేక విండో ఏర్పాటుకు అనేక రకాలుగా పోరాటాలు, ఆందోళనలు చేసినా ఫలించలేదు. దీంతో కొన్ని సంవత్సరాల పాటు కాచాపూర్, బంజర్ల రైతులు బస్వాపూర్ విండో ఎన్నికల్లో పోటీని బహిష్కరించారు. కానీ 16 కిలో మీటర్ల దూరంలో ఉన్న బస్వాపూర్‌కు ప్రతీ చిన్నదానికి ముఖ్యంగా విత్తనాలు, ఎరువులకు వెళ్లాలంటే ఈ రెండు గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కాగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం మళ్లీ కాచాపూర్ గ్రామస్థులు ప్రత్యేక విండో ఏర్పాటుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. సీఎం, మంత్రులు, సంబంధిత అధికారుల వద్దకు క్రమం తప్పకుండా వెళ్తూ వారికి రైతుల సమస్యల వివరిస్తూ కాచాపూర్‌ను బస్వాపూర్ నుంచి విడదీసి కాచాపూర్‌ను ప్రత్యేక విండోగా ఏర్పాటు చేయాలని ఒత్తిడి పెంచారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న బాధలను దృష్టిలో ఉంచుకుని కాచాపూర్‌ను ప్రత్యేక విండోగా నేడు ఉత్తర్వులు జారీ చేయడంతో కాచాపూర్, బంజర్ల గ్రామస్థుల కల నేటితో సాకారమైంది. దీంతో కాచాపూర్, బంజర్ల గ్రామస్థుల సంబరాలు అంబరాన్నంటాయి.



డీసీవో నుంచి ఉత్తర్వుల కాపీని అందుకుంటున్న దృశ్యం

కాచాపూర్ ప్రత్యేక విండోగా ఉత్తర్వుల జారీ

కాచాపూర్ విండోను ప్రత్యేక విండోగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కాచాపూర్ ప్రత్యేక విండోగా ఏర్పాటు చేస్తూ వచ్చిన ఉత్తర్వుల కాపీని శనివారం డీసీవో శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా కాచాపూర్ గ్రామానికి చెందిన డీసీసీబీ డైరెక్టర్, బస్వాపూర్ విండో చైర్మన్ లింగాల కిష్టాగౌడ్ అందుకున్నారు. ఈ విషయాన్ని కిష్టాగౌడ్ గ్రామస్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందివ్వడంతో గ్రామంలో సంబరాలు మొదలయ్యాయి. గ్రామంలో టపాసులు కాల్చి, ఒకరినొకరు స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఎన్నో ఏళ్ల కల నెరవేరింది

- కిష్టాగౌడ్, డీసీసీబీ డైరెక్టర్

తమ గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల కల నేటితో నెరవేరింది. తమ విండో అప్పట్లో నష్టాల్లో ఉండటంతో ఈ విండోను 16 కిలో మీటర్ల దూరంలో ఉన్న బస్వాపూర్ విండోలో కలిపారు. అప్పటి నుంచి గ్రామస్థులందరం తిరిగి కాచాపూర్‌కు ప్రత్యేక విండో హోదా కల్పించాలని అనేక రకాలుగా ప్రయత్నాలు చేశారు. ఎన్నో ప్రయత్నాలు, ఆందోళనల కారణంగా కాచాపూర్ విండోను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విండోగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సీఎం, కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారుడికి కృతజ్ఞతలు.

ప్రభుత్వ సలహాదారుడి కృషి మరువలేనిది

- గాల్‌రెడ్డి, తాజా మాజీ ఎంపీపీ

కాచాపూర్ విండోను బస్వాపూర్ విండో నుంచి విడదీసి ప్రత్యేక విండోగా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో, ప్రస్తుత ప్రభుత్వంలో ప్రభుత్వ సలహాదారుడు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ తమ కాచాపూర్ విండోను ప్రత్యేక విండోగా తిరిగి ఏర్పాటు చేసేందుకు ఎంతగానో సహకరించారు. ఆయన కృషితోనే ప్రస్తుతం కాచాపూర్ ప్రత్యేక విండోగా తిరిగి ఏర్పాటు కాగల్గింది. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి : పీఆర్‌టీయూ

రెంజల్, ఆగస్టు 24: నిరంతరం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని పీఆర్‌టీయూ నూతన మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగంగౌడ్, కిషోర్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో పీఆర్‌టీయూ నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా సోమలింగంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా కిషోర్‌కుమార్, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా తాహెర్, వైస్ ప్రెసిడెంట్‌గా అపర్ణ, సెక్రెటరీగా శ్రీనివాస్‌రెడ్డి, ఉమెన్స్ సెక్రెటరీగా రాజశ్రీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మండలంలో పీఆర్‌టీయూ బలోపేతానికి కృషి చేస్తామని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ గౌరవ జిల్లా అధ్యక్షులు ఇల్తెపు శంకర్, ఎంఈవో గణేష్ రావు, మండల నోడల్ ఆఫీసర్ ఆంజనేయులు, పీఆర్‌టీయూ నాయకులు సాయిరెడ్డి, నర్సింహ రెడ్డి, గంగాధర్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టేట్ డైరెక్టర్ విశ్వనాథ్ రెడ్డి

నిరుద్యోగులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : డైరెక్టర్

డిచ్‌పల్లి,ఆగస్టు 24 ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల డైరెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన డిచ్‌పల్లిలో గల ఆర్‌ఎస్‌ఈటీఐ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న మగ్గం వర్క్, టైలరింగ్ శిక్షణ అభ్యర్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో బాగ్యలక్ష్మీ, రామకృష్ణ, రంజిత్, నవీన్ పాల్గొన్నారు.

'ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు'

డిచ్‌పల్లి, ఆగస్టు 24: ఓపెన్ స్టడీ సెంటర్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియేట్‌లలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కమలపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమర్‌సింగ్ తెలిపారు. ఆసక్తి గల వారు పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

'సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయాలి'

డిచ్‌పల్లి, ఆగస్టు 24: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో అప్లైడ్ ఎకనామిక్స్ ఐఎంబీఏ, ఇంటిగ్రేటెడ్ ఫార్మాసుటికల్ కెమిస్ట్రీ, ఎల్‌ఎల్‌బీ 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వెంటనే విడుదల చేయాలని టీయూ పీడీఎస్‌యూ నాయకులు వర్సిటీ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ సాయిలుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ. 6వ సెమిస్టర్ పరీక్షలు పూర్తయ్యి నెల రోజులు గడుస్తున్నా.. ఇంకా ఫలితాలు విడుదల చేయాలేదని, విద్యార్థులు ఉన్నత విద్య కోసం సెంట్రల్, స్టేట్ యూనివర్సిటీల్లో అప్లై చేసుకున్నారని, వాటి అడ్మిసన్ల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇందులో ప్రిన్స్, దేవిక, రవీందర్, అక్షయ్, వంశీ, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోచారంను కలిసిన వర్ని, చందూర్ నాయకులు



పోచారంను కలిసిన వర్ని నాయకులలు

వర్ని, ఆగస్టు 24: రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమితులైన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని శనివారం వర్ని, చందూర్ మండలాల కాంగ్రెస్ నాయకులు కలిశారు. వ్యవసాయశాఖ మంత్రిగా అనుభవం ఉన్న పోచారంకు సీఎం రేవంత్ రెడ్డి అదే శాఖలో హోదానివ్వడం హర్షించదగ్గ విషయమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోచారంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి.సత్యానారాయణ, సీహెచ్ గంగారాం, నామాల సాయిబాబా, గిరి, గోపాల్, ప్యారం అశోక్, నరేడ్ల శ్రీను, గొర్తి వెంకటేశ్వర రావు, రాజిరెడ్డి, రుక్మిణి రాంరెడ్డి, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో ఇసుక వేలం

కోటగిరి,ఆగస్టు24: పొతంగల్ మండల కేంద్రంలో సీజ్ చేసిన 45ట్రాక్టర్ల ఇసుకకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. పొతంగల్ గ్రామానికి చెందిన గంధపు దత్తు అనే వ్యక్తి 20వేలకు వేలంలో ఇసుకను దక్కించుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.

'విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి'

మాక్లూర్, ఆగస్టు24: ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్య కోర్సులలో చేరిన కొత్త విద్యార్థులు భవిష్యత్‌లు ఆలోచించి గొప్ప ఇంజనీర్లుగా రూపుదిద్దుకుంటారని విజయ్ కళాశాలల చైర్మన్ నరేంధర్‌రెడ్డి ఆశభావం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని దాస్‌నగర్ గ్రామశివారులో గల విజయ్ ఇంజనీరింగ్ కళాశాలలో 2024 బ్యాచ్ బిటెక్ అభ్యర్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంధర్‌రెడ్డి జ్యోతిప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ విద్యప్రయాణంలో మీరు విజయం సాధించడానికి కళాశాల సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అధ్యాపక బృందంతో పాటు కళాశాలలో అన్ని హంగులు ఉన్నాయని, వాటిని ప్రతీఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌కుమార్‌తో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్‌స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు24: భీమ్‌గల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ చదివే విద్యార్థుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యలో చదివు మానివేసిన విద్యార్థులు పదవ తరగతిలో ప్రవేశాల కోసం 14ఏళ్ళు నిండి ఉండాలని, ఇంటర్మీడియేట్ ప్రవేశాల కోసం 15ఏళుల నిండి ఉండాలని, ఆసక్తి గల విద్యార్థులు వచ్చేనెల 10తేదీలోగా అడ్మిషన్‌లు పొందాలని కోరారు. ఇతర వివరాలకు 9491534015, 9948082804నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ముప్కాల్ పీఆర్‌టీయూ అధ్యక్షునిగా కొత్తపల్లి శ్రీనివాస్

ముప్కాల్, ఆగస్టు 24 : ముప్కాల్ మండల పీఆర్‌టీయూ అధ్యక్షునిగా కొత్తపల్లి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధానకార్యదర్శిగా కోంద్రు నవీన్, మండల అసోసియేషన్ అధ్యక్షునిగా జి.రవి కుమార్, మండల కార్యదర్శిగా రాజేందర్, మహిళ ఉపాధ్యక్షురాలిగా ఇందిరాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరంతరం అందరి సహకారంతో పోరాడతామని తెలిపారు.

మూడు ఇసుక టిప్పర్ల పట్టివేత

ఎడపల్లి, ఆగష్టు 24 : ఎడపల్లి మండల కేంద్రంలో శనివారం ఉదయం ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్‌లను ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్ పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై వంశీ కృష్ణారెడ్డి హెచ్చరించారు.

రాణాకలాన్ గ్రామానికి రథం అందజేత

ఎడపల్లి, ఆగస్టు 24 : మండలంలోని రానాకలాన్ గ్రామానికి మంగళపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రథాన్ని బహుమానంగా అందజేశారు. మంగళపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంగళపల్లి నర్సింలు రాణాకలాన్ గ్రామాన్ని వదిలి 30 సంవత్సరాలు అయినా తన ఊరుమీద ఉన్న మమకారంతో తన తల్లిదండ్రులు మంగళపల్లి సరస్వతి, పెద్ద గంగారాంల జ్ఞాపకార్థం రెండు లక్షల యాభై వేల రూపాయల ఖర్చుతో స్వర్గధామ రథాన్ని తయారు చేయించి గ్రామానికి బహుమానంగా అందించినందుకు గ్రామస్థులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాలంద భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకుల సురేష్, గ్రామ పెద్దలు రాజారెడ్డి, శ్రీనివాస్, గోపీకృష్ణ అరవింద్, నూర సాయి రెడ్డి, సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బోధన్‌రూరల్, ఆగస్టు 24 : బోధన్ పట్టణంలో రెండు రోజుల క్రితం లభ్యమైన మృతదేహానికి సంబంధికులు రాకపోవడంతో అనాథ శవానికి శనివారం బోధన్ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలు, దహన సంస్కారాలకు కావాల్సిన ఆర్థిక సహాయాన్ని పట్టణ వ్యాపార వేత్త కిషోర్ ఇనాని మార్వాడిసెట్ అందించారు.

జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్యామ్‌రావు

బోధన్‌రూరల్, ఆగస్టు 24: బోధన్ కోర్టులో 5వ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్ కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న అడ్వకేట్ శ్యామ్‌రావును నిజామాబాద్ జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ అండ్ సెషన్ కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బోధన్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది శ్యామ్‌రావును నియమించడంతో న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యకం చేశారు.

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు డాక్టరేట్ ప్రదానం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 24 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూర్ విజ్ఞాన్ యూనివర్సిటీలో మాజీమున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. గతంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో విద్యపై మమకరంతో పీహెచ్‌డీ చేయాలనే పట్టుదలతో గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో అడ్మిషన్ తీసుకొని పీహెచ్‌డీ పూర్తి చేసింది. దీంతో దీంతో యూనివర్సిటీలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి పోమిడిగంతం నర్సింహంచే డాక్టరేట్ పట్టాను పండిత్ వినీత కుటుంబసభ్యులతో కలిసి అందుకున్నారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 24 : పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఎంపర్ నిర్మాణ్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రత, తమ ఆరోగ్యాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, సభ్యులు భైరి శ్రీధర్, చెన్న రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



కుకునూర్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



వేంపల్లి ప్రభుత్వ పాఠశాలలో వేషధారణను తిలకిస్తున్న ఎంపీ

ముప్కాల్, ఆగస్టు24: బాల్కొండ మండలం వేంపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వ హించిన కృష్ణష్టామి వేడుకల్లో ఎంపీ ధర్మపురి అర్వింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థుల శ్రీ, కృష్ణుడు, గోపికల వేషాదారణ, వారు ఉట్టి కొట్టే ప్రదర్శన ఆయన ఆసక్తిగా తిలకించారు. అనంతరం పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేఈఈ మెయిన్స్‌లో ఆల్‌ఇండియాలో స్థాయిలో 51వ ర్యాంకు సాధించిన విద్యార్థి చరణ్, వారి తల్లిదండ్రులు వెంకట నర్సయ్య దంపతులను ఎంపీ అర్వింద్ అభినందించారు. ఈ సందర్భంగా వారు ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను ఘనం గా సన్మానించారు. ఎంపీ వెంట బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపా ధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, రాజీఎంపీటీసీ నాయకుడు పద్మ, బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, చిల్క దినేష్, నాయకుడు సంతోష్, కల్లూ స్వామి, నర్సిం గ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెంటిల్‌కిడ్స్ పాఠశాలలో శనివారం కృష్ణష్టామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధకృష్ణుల వేషాదారణలో అందరిని ఆకర్షించారు. పాఠశాలలో ఉట్టి ఏర్పాటు చేసి చిన్నారులచే ఉపాధ్యాయులు ఉట్టికొట్టించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్మైల్ ప్లే స్కూల్‌లో.......

పట్టణంలోని స్మైల్ ప్లే స్కూల్‌లో కృష్ణష్టామి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధకృష్ణుల వేషాదారణలో ఏర్పాటు చేసిన ఉట్టిలను కొట్టారు. అనంతరం కరస్పాండెంట్ షబాన గోహార్ కృష్ణష్టామి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రఫీగోహార్, ఉపాధ్యాయులు సరిత, స్వప్న, సింధుజ, ప్రసన్న, సరిత, రోజ శ్రావణి, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలంలోని కుకునూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థినిలు కృష్ణష్టామి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నికృష్ణుడు గొల్ల బామల విద్యార్థిని విద్యార్థులు అలరింపజేశారు. విద్యార్థులు ఉట్టికొట్టి ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్; నరేంధర్, రామకృష్ణ, నీరజ, తేజస్వీని, పేరెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని చతురస్ర పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు కృష్ణుడు గొల్లబామలతో వేషదారణలో నృత్యాలు చేసి గ్రామస్థులను అలరించారు. సాయంత్రం విద్యార్థులచే ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన శ్రీకృష్ణుడు, రాధ, గోపికల అందంగా తయారు కావడంతో గ్రామస్థులను ఆకట్టుకున్నాయి.

పెర్కిట్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని శనివారం నలంద పాఠశాలలో కృష్ణష్టామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు రాధ కృష్ణుడు వేషాదారణలో ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్ని కృష్ణుడు పాటలపై చిన్నారులు నృత్యాలు పలువురిని అలరించాయి.. అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉట్టిని చిన్నారులందరు కలిసి ఉట్టిని కొట్టారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని క్షత్రీయ పాఠశాలలో శనివారం కృష్ణష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రాధకృ ష్ణుల వేషధారణలో అలరించారు. నృత్యప్రదర్శనలు, భగవద్గీత శ్లోకాలతో చిన్నారులు అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నవీత, క్షత్రీయ విద్యా సంస్థల కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, డైరెక్టర్ అల్జాపూర్ అక్షయ్, పరిక్షిత్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : మండలంలోని పలు గ్రామాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణ ధరించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో వేద పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. సాంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా కృష్ణాష్టమి వేడుకలు కొనసాగాయి. కార్యక్రమంలో పాఠశాల బృందం రవి, అక్షర, నిర్మల, సాయి పవన్, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండంలోని వివిధ పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థిని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన ఉట్లుకొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మిసిమి, విజ్ఞానజ్యోతి, కృష్ణవేణి పాఠశాలలో ఉట్లు కొట్టే కార్యక్రమాన్నిఘనంగ జరుపుకున్నారు.ఈ సందర్భంగా చిన్ని కృష్ణుడు గోపికల వేశాద్యాణలో చిన్నారి విద్యార్థిని విద్యార్థులు అలరించగా విద్యార్థినుల కోలాటాలు అకర్శనియంగా నిలిచారు. కార్యక్రమంలో పాఠశాలల కరస్పాండెంట్లు బాలి రవిందర్, గుండోజి దేవేందర్, చిలుక గంగప్రసాద్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో...

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కోనాసముందర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు



మాక్లూర్‌లో వైద్యం అందిస్తున్న వైద్యులు

కమ్మర్‌పల్లి,ఆగస్టు 24: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతు దోమలు వ్యాపించకుండా అప్రమత్తంగా ఉండాలని చౌట్‌పల్లి ప్రభుత్వం ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సుప్రియా సూచించారు. శనివారం మండలంలో ని కోనాస మందర్ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి గ్రామ ప్రజలకు వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా గ్రామానిక చెందిన 78 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి దగ్గు, జలుబు, జ్వరం ఉన్నవారికి తగుమందులు అందజేశారు. జిల్లా కలెక్టర్, వైద్యాశాఖ అదికారి ఆదేశానుసారం చౌట్‌పల్లి ఆసుపత్రి పరిది గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సీనల్ వ్యాదులు దరిచేరకుండా అప్రమత్తంగా ఉండాలని కాచి వడబోసిన నీటినే తాగాలని సూచిస్తు ఏలాంటి ఇబ్బందుల ఎదురైన సమీప ఆసుపత్రులకు వెళ్లి పరీక్షులు చేయించుకోవాలని సూచించారుగురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సదాశివ్, ఆరోగ్యవిస్తీరణ అధికారి చింత సత్యనారాయణ, స్థానిక ఏఎన్ఎం అమృత, ఆశావర్కర్‌లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాక్లూర్ : మండల ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి వెంకటేశం సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మాక్లూర్ జిల్లా వైద్యాధికారి ఆదేశాల ప్రకారం ప్రజలకు వైద్యసేవలను అందజేశారు. ఈ సందర్భంగా రూ.58మందికి వైద్యుల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచివడబోసిన నీటిని తాగి ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. శనివారం జక్రాన్ పల్లిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. దోమల వల్ల వ్యాపించే డెంగ్యు, మలేరియా, బోదకాల వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రైడే డ్రైడేను నిర్వహించి దోమల నివారిస్తే రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాయన్న, హెల్త్ సూపర్‌వైజర్ సిద్ధి, హెల్త్ అసిస్టెంట్ రాజు, ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్, ఎల్ఈడీ టీవీ వితరణ

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 24 : భీమ్‌గల్ మండలంలోని గోనుగొప్పుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం దాతలు రిటైర్డు అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, చెరుకుపల్లి విజయేందర్‌రెడ్డి కుటుంబసభ్యులు ల్యాప్‌టాప్, ఎల్ఈడీ టీవీని వితరణ చేశారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారంగా వీటిని అందజేసినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శంకర్, బోజాగౌడ్, భూమేశ్వర్, చరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

వేర్వేరుగా బస్సులు నడపాలని వినతి



సూపరిండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నవీపేట, ఆగస్టు 24: మండలంలోని నందిగామ, మద్దెపల్లి గ్రామాలకు వేర్వేరుగా బస్సులను నడపాలని కోరుతూ శనివారం నందిగామ, యంచలకు చెందిన పలువురు గ్రామస్థులు నిజామాబాద్ ఆర్టీసీ డిపో-2 సూపరిండెంట్ శ్రీలతకు వినతిపత్రం సమర్పించారు. గతంలో నందిగామ, మద్దెపల్లి గ్రామాలకు వేర్వేరుగా ్రాబస్సులు నడిచేవని, ప్రస్తుతం రెండు గ్రామాలకు కలిపి ఒకే బస్సును తిప్పడంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భూంరావ్, లాలు యాదవ్, సంజీవ్, అనంత రావు, మహేష్, మహదేవ్, రాజు, తదితరులున్నారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్‌బాటిళ్లు అందజేత

వేల్పూర్, ఆగస్టు 24 : వేల్పూర్ మండలం కుకునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు హరిచరణ్ విద్యార్థులకు స్టీల్‌వాటర్ కావాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన తమ్ముడు అనసూరి వసంత్‌సాయి (సెంట్రల్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టార్) ఆయన భార్య మౌనిక (స్టేట్ బ్యాంక్ అధికారిణి) విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు. సుమారు రూ.20వేల విలువ గల స్టీల్ వాటర్ బాటిళ్లను వంద మంది విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు క్లాస్ గదుల్లో వెళ్ళేటప్పుడు స్టీల్ వాటర్ బాటిల్ తీసుకొని వెళ్ళాలని, విద్యార్థులు పాఠాలు వింటున్న సమయంలో దాహం వేసినప్పుడు ఈ వాటర్ బాటిల్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కాల సాయన్న, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దాసరి వనిత, మాజీ వైస్‌ఎంపీపీ బోజపల్లి సురేష్, మాజీసర్పంచ్ శ్రీరాం విజయ లింబాద్రి, మాజీ విద్య కమిటీ చైర్మన్ పడాల రాజశేఖర్‌గౌడ్, వీడీసీసభ్యులు గోడ్కొండ లింగన్న, దాసరి నర్సయ్య, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తాం

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

మాక్లూర్, ఆగస్టు 24: పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయడమే తన కర్తవ్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది నుంచి ఎదురు చూస్తున్న సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్నానని, వచ్చేనెల రేషన్‌కార్డు, పింఛన్ దరఖాస్తులను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇళ్ళు లేని వారికి ఇళ్ల నిర్మించుకోవడానికి రూ.5లక్షలు అందజేస్తామన్నారు. హిందువలంత ఐక్యంగా ఉండాలని, హిందు సమాజం ఇతరులకు ఆదర్శంగా ఉంటూ కులాలకు అతీతంగా అభివృద్ధిని కోరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, గంగోని సంతోష్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

మెండోర మండల పీఆర్‌టీయూ కార్యవర్గం ఎన్నిక

మెండోర, ఆగస్టు 24 : మండల పీఆర్‌టీయూ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం పీఆర్‌టీయు మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా సురేంధర్, మండల ప్రధానకార్యదర్శిగా నర్సింలు, అసోసియేట్ అధ్యక్షుడుగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఉషరాణి, సెక్రెటరీగా వినోద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న దృశ్యం



నవీపేటలో..

రెంజల్,ఆగస్టు24: పేదల సంక్షేమం కోసం నిరంతరం తపించే మార్గదర్శకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి మంజూరైన 79సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేసే నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అన్నారు. ప్రజల కోసం తపించే నాయకుడు ముఖ్యమంత్రి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నిరంతరం కృషి చేసే నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్ రెడ్డి, సాయిరెడ్డి, ధనుంజయ్, సాయిబాబా గౌడ్, రమేష్ కుమార్, జావీదోద్దీన్, సురేందర్ గౌడ్, నితిన్, శ్రీనివాస్, మోహన్, గంగాకిషన్, గయాస్, సాయాగౌడ్; కార్తీక్, కిరణ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 78మందికి 16.61,500 రూపాయ్యాలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మహిపాల్ ర్యెడ్డి, బాలరాజు గౌడ్, బుచ్చన్న, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం మండల కాంగ్రెస్ నాయకులు పంపినిచేశారు. కమ్మర్‌పల్లికి చెందిన సుందరిగిరి దిలీప్‌కు 29 వేలు, కోటగిరి రాజగౌడ్‌కు 55 వేల రూపాయల చెక్కులు మంజూరిగా కమ్మర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్కుఎట రవి బాదితలకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుచ్చిమల్లయ్య, వేముల గంగారెడ్డి, సల్లూరి గణేష్ గౌడ్, దూలూరు కిషన్ గౌడ్, శేఖర్, నాగరాజు, పాలెపు చిన్న గంగారాం, అజారోద్దీన్ , సుంకెట శ్రీనివాస్, ప్రసాద్, ప్రదీప్, సుంకరి రాజేశ్వర్, నల్ల సాయికుమార్, చంద్రకాంత్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంరిలీఫ్ ఫండ్ మంజూరి చేయించి కాంగ్రెస్ బాల్కొండ నియోజికవర్గ ఇన్‌చ్యార్జ్ ముత్యాల సునీల్ కుమార్, కాంగ్రెస్ నాయకులకు బాదితు కృతజ్ఞతలు తెలిపారు.

వేల్పూర్ : వేల్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు పంపిణీ చేశారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ ప్రత్యేక చొరవతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన ఆదేశాల మేరకు పంపిణీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమణ, రేవంత్‌రెడ్డి, చరణ్, మల్లారెడ్డి, పద్మరావు, సురేందర్, అనిల్, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ఐదు సెంటీమీటర్ల వర్షపాతం

కమ్మర్‌పల్లి, ఆగస్టు 24 : కమ్మర్‌పల్లి మండలంలో శుక్రవారం అర్ధ రాత్రి భారీవర్షం కురిసింది. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఓ మోస్తారులో వర్షం కురిసింది. మండలంలో 50.6 మిల్లీ మీలర్లు (5 సెంటీమీటర్ల)వర్షపాతం నమోదయింది. ఈవర్షంతో మండలంలో అతిపెద్ద చెరువు బషీరాబాద్ కాడిచెరువు నిండి అలుగు పారింది. మండలంలోను అత్యధిక ఆయకట్టు ఉన్న చెరువు బషీరాబాద్ కాడిచెరువు దీని ఆయకట్టు సుమారు 6 వందల ఎకరాలువరకు ఉంటుంది. కాడిచెరువు నిండడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. కాగా గతవారం రోజులక్రితమే కోనాసమందర్ చెరువు, ఇదివరకే రాళ్లవాగు , గట్టుపొడిచినవాగులు పొంగిపొర్లూతుర్యాడగా మండంలోని వివిధ గ్రామాలలోని చెరువులు కుంటలు మత్తళ్ల పారుతున్నాయి.



అలుగు పారుతున్న బషీరాబాద్ కాడిచెరువు

బస్సులు సమయానికి నడపాలని వినతి

దోమకొండ, ఆగస్టు 24 : బస్సులు సమయానికి రావడం లేదని శనివారం బీబీపేట మండల కేంద్రంలో వివిధ గ్రామలకు చెందిన విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ సరైన సమయంలో బస్సులు రాకపోవడం వలన తాము కళాశాలకు లేటుగా వెళ్లడంతో క్లాసులు మిస్ అవుతున్నామన్నారు. బస్సులు కళాశాల సమయానికి తగ్గట్టుగా నడపాలని కోరారు. తమకు ఉదయం ఏడుగంటల నుంచి 7.30 గంటల మధ్యలో బస్సులు నడిచే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల పరిశీలన

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 24 : మండలంలోని ఆయా గ్రామాలలో ఇటీవల కాలంలో వ్యవసాయ శాఖ ద్వారా ఏఈవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల వివరాలు పరిశీలన చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కిషన్ తెలిపారు. శనివారం మండలంలోని లింగంపల్లి, కాటేపల్లి, తుప్దాల్ గ్రామాలలో ఖరీఫ్ సీజన్ కింద రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో కిషన్ మాట్లాడుతూ ఆయా గ్రామాలలో ఏఈవోలు గత కొద్దిరోజుల క్రితం ఆన్‌లైన్‌లో రైతులు సాగుచేసిన పంటలను నమోదు చేశారని, ఏఈవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ వివరాలు నమోదు

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 24: పెద్ద కొడప్‌గల్ మండలంలో 2020 సంవత్సరంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల వివరాలు ఆన్‌లైన్ ద్వారా యాప్‌లో నమోదు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. గత 2020 సంవత్సరంలో గత ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్దిదారులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా, అవి పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్ వివరాలు పరిశీలించి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 125 ఉన్నాయని వాటి వివరాలు పరిశీలించిన ఆన్‌లైన్ ద్వారా యాప్‌లో నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిటి రవికాంత్, ఇరిగేషన్ ఏఈ రహ్మాన్, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర కులగణన చేయాలి'

కామారెడ్డిటౌన్, ఆగస్టు 24 : రాష్ట్రంలో కులగణన చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయాల్సిందేనని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీలనాగరాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమగ్ర కులగణన చేసి బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంబీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, అధ్యక్షుడు మాయప్రసాద్, జిల్లా ప్రధానకార్యదర్శి మహేష్‌దయాకర్, నాయకులు రమేష్, నరేష్, ప్రవీణ్, రాజేందర్, యోగేష్, ప్రశాంత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలో చోరీ

గాంధారి, ఆగస్టు 24 : మండల కేంద్రంలోని మాజీ ఎంపీటీసీ పత్తిశ్రీనివాస్ ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. శ్రీనివాస్ తన కుటుంబంతో సహా శుక్రవారం రాత్రి 9 గంటలకు ఫంక్షన్‌లో పాల్గొనేందుకు మర్కల్ గ్రామానికి వెళ్లి రాత్రి 11.30కు వచ్చాడు. ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో గల రెండున్నర తులాల బంగారం, 20 తులాల వెండి,నగదును దొంగిలించుకుని వెళ్లారని తెలిపారు. బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా సవరించాలి : డీపీవో



ఓటరు నమోదుప్రక్రియను పరిశీలిస్తున్న డీపీవో

సదాశివనగర్, ఆగస్టు 24 : ఓటర్‌జాబితాలో ఎలాంటి తప్పులు దొరలకుండా జాగ్రత్తగా పరిశీలించి ఓటరు సవరణ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. సదాశివనగర్‌లో నిర్వహిస్తున్న ఓటర్ జాబితా నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలను పకడ్బందిగా నిర్వహించేందుకు ఓటరు జాబితా ఎంతో ముఖ్యమని అన్నారు. కొత్త ఓటర్ల నమోదు ఓటరు లిస్టులో పేరు తప్పులు, స్థల మార్పిడి లాంటి వాటిని జాగ్రత్తగా పరిశీలించి ఫారాలను సక్రమంగా పూరించి ఓటరు లిస్టు సవరణ జరగాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్‌కుమార్,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన ఏజెన్సీ కార్మికుల ధర్నా

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 24: తమ సమస్యలు పరిష్కరించాలంటూ శనివారం జుక్కల్ మండల మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల విద్యావనరుల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ కార్యవర్గ సభ్యులు సురేష్ గొండ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన విధంగా కార్మికులకు 10 వేల వేతనం, పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించడంతో పాటు, వంట పాత్రలు కొని ఇవ్వడం, కొత్త వంట గదుల నిర్మాణం, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించడంతో పాటు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పిర్దోస్, ఏజెన్సీ కార్మిక సంఘం నాయకులు నర్సింహులు, చందర్, కిరణ్, పుల్లవ్వ, గంగమణి, సునీత, లలిత, జగదేవి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



వేడుకల్లో ఉట్టి కొడుతున్న దృశ్యం



గిద్ద ప్రభుత్వ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఎల్లారెడ్డి, ఆగస్టు 24 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో గల పలు పాఠశాలల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు వేసిన వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పట్టణంలో గల బ్రిలియంట్ హైస్కూల్, కృష్ణవేణి హైస్కూల్‌లలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ని కృష్ణుని వేషధారణలో విద్యార్థిని, విద్యార్థులు ఎంతగానో ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బ్రిలియంట్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్, కృష్ణవేణి, ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

దోమకొండ : మండల కేంద్రంలోని ఏకలవ్య, వాసవి, త్రివేణి, అభ్యుదయ పాఠశాలల్లో శనివారం శ్రీ క్రిష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రిష్ణుడి వేషధారణ, గోపికలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భిక్కనూరు : మండలకేంద్రంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. మండలకేంద్రంలోని చైతన్య పాఠశాలలో భిక్కనూరు ఎస్సై సాయికుమార్ వేడుకలను ప్రారంభించి కాసేపు ఉట్టికొట్టి విద్యార్థులను అలరించారు. కార్యక్రమంలో ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు.అక్షర పాఠశాలతో పాటు ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు చిన్నారులకు శ్రీకృష్ణుడి, గోపికమ్మల వేషదారణతో సందడి వాతవరణాన్ని సృష్టించారు .రామారెడ్డి మండలంలోని గిద్ద గ్రామంలో గత ప్రభుత్వ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఉపాధ్యాయులు నిర్వహించారు.

ప్రజల కోసమే పార్టీ మారాను

● ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, ఆగస్టు 24 : తాను పార్టీ మారింది నియోజకవర్గంలోని ప్రజల కోసమే అభివృద్ధి కోసమేనని నా కుటుంబం కోసం కాదని నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం అని ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ మండల కేంద్రంలో 37.5 కోట్లతో నూతనంగా నిర్మించే 100 పడకల ఏరియా ఆసుపత్రికి శనివారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ అందరికీ ఉపయోగపడే ముఖ్యమైన అవసరాలు విద్య, వైద్యంతో పాటు నీటి పారుదల అవసరమన్నారు. వంద సంవత్స రాలు ఉండే విధంగా ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. తాను ఏ పని అయినా గుడ్డిగా చేయను అని అన్నారు. కొందరు చిల్లర మల్లర నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమం పేద ప్రజల బాగోగులే తన లక్ష్యమని, పదవులు కాదని ఆయన తెలిపారు. ఏది ఏమైనా ఎవరో ఏదో అన్నారని పట్టించుకోవద్దని, అభివృద్ధి కోసం పాటుపడతానని ప్రజల కోసం కష్టపడతానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. విజయలక్ష్మీ, శ్రీనివాస్ ప్రసాద్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుడు

రేషన్‌షాపును ఏర్పాటు చేయాలని వినతి

భిక్కనూరు, ఆగస్టు 24: తమ కాలనీలో రేషన్‌షాపును ఏర్పాటు చేయాలని కోరుతూ భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ హరిజనవాడ యువకులు తహసీల్దార్ శివ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీలో రేషన్‌షాపు లేకపోవడంతో చాలాదూరంలో ఉన్న రేషన్ షాపుకు వెళ్లాల్సి వస్తుందని, ఈ దూరం కారణంగా వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటుగా రేషన్ తీసుకుని వచ్చే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ కాలనీలో రేషన్ షాపును ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీ యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించండి'

కామారెడ్డిటౌన్,ఆగస్టు 24:ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరనాన్ని కాపాడుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలలో ప్లాస్టిక్‌వ్యర్థాల మిషన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను వాడకం తగ్గించి పరిసరాలన్ని శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్లాస్టిక్‌ను బహిరంగ ప్రదేశాల్లో పారవేయొద్దని తెలిపారు.అనంతరం పాతరాజంపేటలోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. విద్యుత్ సమస్యపై ప్రజలు వివరించడంతో విద్యుత్ సౌకర్యం కల్పించాలని డీఈను కోరారు.త్రాగునీటి సమస్య ఎదురుకాకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు కృష్ణమూర్తి, చాట్లవంశీ, భాస్కర్‌గౌడ్, ఏఈ శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్,ఆర్‌ఎంఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

మద్నూర్, ఆగస్టు 24 : మండలంలోని చిన్న ఎక్లారా గ్రామంలో పత్తి, సోయాబీన్, కంది పంటలను మండల వ్యవసాయ అధికారి రాజు పరిశీలించి తగు సూచనలు చేశారు. సోయాబీన్ పంటలో ప్రధానంగా కాండపు ఈగ ఆశించినట్లు గమనించడం జరిగిందని, ఇలా ఆశించిన పంటలలో మొక్క వడిలిపోయి చనిపోవడం జరుగుతుందని, దీనికి నివారణకు క్లోరోన్‌ట్రినిపోల్, లంబ్డా, సైక్లోత్రిన్ అనే మందును 80 ఎంఎల్ ఎకరాకు లేదా థైమోథ్యాక్సిన్, లాండ్డాసైక్లోత్రిన్ 100 ఎంఎల్ ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. సోయాబీన్ పంటలో కాయ కుళ్ళు తెగులు నివారణకు ప్రోపికోనజోల్ 200 ఎంఎల్ ఎకరాకు లేదా ట్రిఫ్లోఆక్సిస్ట్రోబిన్ 200 ఎంఎల్ ఎకరాకు పిచికారి చేయాలని తెలిపారు. ఫ్లూనోకామైడ్ 50-60 గ్రాములు ఎకరాకు, పూత పిందే రాలడంను నివారించడానికి, ప్లానోఫిక్స్ ఎకరాక 50 ఎంఎల్‌లు పిచికారి చేయాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి రాజు రైతులకు సూచించారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్‌బాబు

భిక్కనూరు, ఆగస్టు 24 : రైతులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తమ సిబ్బంది సూచనలతో పాటుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్ కో ఎస్ఈ రమేష్‌బాబు అన్నారు. శనివారం భిక్కనూరు సౌత్‌సెక్షన్‌లో ట్రాన్స్‌కో అధి కారులు రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ మోటార్లకు కెపా సీటర్లను పెట్టుకోవాలని, ఇనుప స్టార్టర్ డబ్బాలకు బదులు ప్లాస్టిక్ స్టార్టర్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫా ర్మర్ల వద్ద, వ్యవసాయబావుల వద్ద ఏమైనా విద్యుత్ సమస్యలుంటే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని వారు అక్కడి చేరుకుని రైతుల సమస్యలను పరిష్కారిస్తారని సూచించారు. అనంతరం ఎంప్లాయి ఆఫ్ మంత్ ఆఫ్ సర్కిల్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రజలకు మెరుగైన సేవలను అందించి ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న భిక్కనూరు ఏఈ శ్రీనివాస్‌ను వారు అభినందించారు. కార్యక్రమంలో క్వాలిటి కంట్రోల్ ఎస్ఈ మాధవరావు, ఏడీఈ కిరణ్‌చైతన్య పాల్గొన్నారు.

దోమకొండ : విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం దోమకొండ, బీబీపేట మండలాల్లో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. లింగుపల్లి గ్రామం, బీబీపేటలో రైతుల పోలాలను సందర్శించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వరంగల్ నోడల్ అధికారి మాధవరావు హాజరయ్యారు.అక్కడ రైతులతో మాట్లాడి విద్యుత్ అధికారుల సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేయలన్నారు.రైతులు తమ బావుల వద్ద మోటర్ స్టార్టర్‌కు సంబంధించి ప్లాస్టిక్ డబ్బాలను అమర్చుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు, వంగిన స్థంభాల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేష్‌బాబు, సుపరింటెండెంట్ ఇంజనీర్ ఆపరేషన్ కామారెడ్డి సర్కిల్ కిరణ్ చైతన్య, దోమకొండ, బీబీపేట ఏఈలు ప్రదీప్ కుమార్,దివ్య గాయత్రి, లైన్‌మెన్ మురళి, రాజు, రైతులు పాల్గొన్నారు.

సోయా పంటకు ఊరటనిచ్చిన వర్షం

మద్నూర్, ఆగస్టు 24 : కొన్ని రోజులుగా వర్షం లేక ఎండిపోతున్న సోయా పంటకు శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం ఊరట నిచ్చినట్లు రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని పెద్దతడ్గూర్, చిన్న తడ్గూర్, అం తాపూర్, ఖరగ్, అంతాపూర్, కొడిచిర, పెద్ద ఎక్లారా, షేకాపూర్ రైతులు గత కొంత కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో సోయా పంట ఎండిపోతుందని ఆందోళన చెందుతున్న సమయంలోనే రాత్రి కురిసిన భారీ వర్షంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. సోయా పంటకు ఈ వర్షం ఎంతో లాభం చేకూరుస్తుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి నీటి వనరులు లేని ఈ గ్రామాలలో వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండిస్తుంటారు. అటువంటిది సోయా పంట వేసిన మొదట్లో వర్షం కురిసిప్పటికీ ఆ తరువాత వర్షం లేకపోగా సోయా పంట ఎండిపోవడం ప్రారంభమైంది. దీంతో ఆందోళన చెందిన కొం దరు రైతులు తమ పంటలకు బోర్ల ద్వారా నీటి ని అందించారు. బోర్లు లేని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. భారీ వర్షం కురియడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉరి వేసుకుని ఒకరి మృతి

సదాశివనగర్, ఆగస్టు 24: మండల కేంద్రానికి చెందిన తడిగం రాజిరెడ్డి (41) ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. ఇటీవల దుబాయ్ నుంచి రాజిరెడ్డి వచ్చాడని, అప్పులు ఎక్కువ కాగా మానసికంగా ఇబ్బందులకు గురి అయి శుక్రవారం రాత్రి తన ఇంట్లోనే లుంగితో ఉరివేసుకున్నాడన్నారు. మృతుని భార్య తడిగం సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బీర్కూర్‌లో ఇసుక లారీ పట్టివేత

బీర్కూర్, ఆగస్టు 24 : బీర్కూర్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి పోలీసుల పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇసుక లోడ్‌తో వెళుతున్న లారీ కనిపించింది. లారీని నిలిపి వేసి తనిఖీ చేశారు. వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. కోటగిరి మండలం పొతంగల్‌లో ఇసుక లోడ్ చేసి బీర్కూర్ మీదుగా కర్నాటకకు రవాణా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో లారీ డ్రైవర్ పేర్కొన్నట్లు తెలిసింది.

పిట్లం : అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకలోడ్‌తో వెళ్తున్న 3 ఇసుక టిప్పర్‌లను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైన ఇసుక తరలిస్తే వారిపై చట్టారిత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

వంతెనకు మరమ్మతులు



వంతెన వద్ద మరమ్మతులు

నిజాంసాగర్, ఆగస్టు 24 : మంజీరా నదిపై రూ. 25 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన వంతెన జాయింట్లు, అప్రొచ్ వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. రోడ్డు భవనాల శాఖ ఈ పగుళ్ల వద్ద మరమ్మతులు చేపట్టేందుకు అప్రొచ్ వద్ద తవ్వకాలను శనివారం చేపట్టారు. వంతెనకు ఇరుపక్కల బీటలు వారడంతో మరమ్మతు చర్యలుచేపట్టారు. ఈ వంతెనను 2017లో వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టి 2023 ఆగస్టులో వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. ప్రారంభం కాక ముందే హైలెవల్ వంతెనకు బీటలు వారడంతో భారీ వాహనదారులు ఆందోళన చెందారు. ఈ వంతెనపై ఇటీవల కాలంలో పలుమార్లు ఆంధ్రజ్యోతిలో బీటలు వారిన వంతెన ప్రమాదంలో ఉందనే శీర్షికన ప్రచురించింది. రోడ్డు భవనాల శాఖాధికారులు మరమ్మతు పనులుచేపడుతున్నారు.

గుజరాత్ నుంచి శ్రీశైలానికి సైకిల్ యాత్ర

మద్నూర్, ఆగస్టు 24 : గుజరాత్ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలానికి సైకిల్ యాత్ర చేస్తున్న స్వామిజీని మద్నూర్ మండల కేంద్రంలో కొంత మంది యువకులు కలిశారు. ఈ సందర్భంగా స్వామిజీ వారితో మాట్లాడుతూ రెండు నెలల క్రితం గుజరాత్ నుంచి బయలుదేరి వస్తున్నట్లు శ్రీశైలానికి వెళుతున్నట్లు వెల్లడించారు. యువకులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ దేశంలో జీవిస్తున్న ప్రతి వ్యక్తి దేశ భక్తి కలిగి ఉండి పరుల కొరకు పరోపకారం చేయాలని గుర్తు చేశారు. యువకులు చెడు అలవాట్లకు బానిస కాకుండా తమ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి కృషి చేయాలని అన్నారు. ప్రతి యువకుడు ఏదో ఒక లక్ష్యంతో ముందుకు వచ్చినట్లయితే వారి భవిష్యత్తుతో పాటు దేశ భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. ఈ దేశం బాగుపడాలంటే ప్రతి ఒక్కరూ దేశ భక్తి కలిగి ఉండాలని గుర్తు చేశారు.

'అధికారులకు బదిలీలు సహజం'

నసురుల్లాబాద్, ఆగస్టు 24 : అధికారులకు వృత్తిరీత్యా బదిలీలు సహజమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ అన్నారు. శనివారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని మండలాభివృద్ధి కార్యాలయంలో బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలు లీలావతి, సుబ్రహ్మణ్యం, ఎంపీవో రాముకు, పంచాయితీ సెక్రటరీలకు, అదే విధంగా నూతనంగా మండలానికి వచ్చిన ఎంపీవో సూర్యకాంత్, నూతన పంచాయితీ సెక్రటరీలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, పంచాయితీ సెక్రటరీలు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

చిన్న తడ్గూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మద్నూర్, ఆగస్టు 24 : మండలంలోని చిన్న తడ్గూర్ గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశం మేరకు ప్రతి గ్రామానికి సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిలు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు ఎస్‌డీఎఫ్ నిధుల కింద ఐదు లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి జుక్కల్ శాసనసభ్యులు కట్టుబడి ఉన్నారని, ఆయన ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని వాటిని అందంగా తీర్చిదిద్దడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిలు, చౌలావర్ హన్మాండ్లు, స్వామి, మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, నాయకులు కొండ గంగాధర్, రమేష్ పాల్గొన్నారు.

'విద్యార్థి దశ నుంచి చరిత్రను తెలుసుకోవాలి'

దోమకొండ, ఆగస్టు 24:తెలంగాణ చరిత్ర వారసత్వం అనే అంశంపై తెలంగాణ విశ్వవిద్యాలయం, దక్షిణ ప్రాంగాణం భాష సంస్కృతి తెలంగాణ భాషా సంస్కృతి శాఖ ,దోమకొండ ఫోర్ట్ సంయుక్తంగా నిర్వహించిన చర్చ వేదిక కార్యక్రమంను దోమకొండ గడికోటలో తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి, ఉస్మానియా విశ్వ విద్యాలయ ఆచార్యులు ఆడప సత్యనారాయణ, దేవి రాజిరెడ్డి, ప్రోగ్రాం డైరెక్టర్ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆర్. సుధాకర్‌గౌడ్ ప్రారంభించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర పూర్వ కాలం నుంచి ప్రస్తుత కాలం వరకు అనే అంశం యావత్తు విద్యార్థి లోకానికి ఉపయోగపడుతుందని చరిత్ర అనేది ప్రతి అంశానికి సంబంధించినదని ప్రతి సంబ్జెక్‌కు చరిత్రయే అన్నిటికి ఆధారమన్నారు. చరిత్ర తెలియని వ్యక్తి చరిత్రహీనుడిగా మిగులుతారని విద్యార్థి జీవితంలో నుంచి మనిషి జీవితం ఉన్నత స్థాయికి ఎదగాలంటే చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టి. ప్రతిజ్ఞ, ఫోర్ట్ డైరెక్టర్ బాబ్జి, వెంకట్‌రెడ్డి, పోతన్న రమేష్, విజయ్‌కుమార్, మారయ్యగౌడ్, జైపాల్‌రెడ్డి, గురువేందర్‌రెడ్డి, సత్యనారాయణ, సురేష్‌గౌడ్, రవీందర్‌గౌడ్, మోహన్‌బాబు, హరిత, లలిత, సునీత, యాలాద్రి, వైశాలి, సరిత, దీలిప్, శ్రీకాంత్, రాహుల్, సంతోష్, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	డబుల్ ఇస్మార్ట్
దర్శన్	మిస్టర్ బచ్చన్
ప్రియా 70	తంగలన్
ప్రియా 35	ఆయ్

బాన్సువాడ	
మహేశ్వరి	మిస్టర్ బచ్చన్
వెంకటేశ్వర	తంగలాన్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	150	180
వెన్‌కాబ్(కిలో)	130	160	190

